# ఓటెత్తిన జనం

- ఉమ్మడి జిల్లాలో రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- రెండు జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసిన ప్రక్రియ
- పలు చోట్ల రాత్రి 9:30 వరకు కొనసాగిన ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు

ఖమ్మం, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గురువారం పోటెత్తారు. 10 నియోజకవర్గాల్లో ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపారు. పోలింగ్ తీరు, ఓటర్ల స్పందన వంటివి బీఆర్ఎస్ విజయానికి సూచికగా ఉంటున్నాయని ఆ పార్టీ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ రాత్రి 9:30 గంటల వరకు కొనసాగింది. ఈవీఎంలు కొన్ని చోట్ల నిదానంగా పనిచేయడం, మరికొన్ని చోట్ల ఓటర్లు పోలింగ్ సమయానికి ముందే బారులు తీరడంతో రాత్రి వరకు అధికారులు పోలింగ్‌ను నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారిని ఓటింగ్‌కు అనుమతించారు. భద్రాద్రి జిల్లా మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో అక్కడ సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగించారు. కానీ ఆ సమయంలోపు క్యూలో ఉన్న వారిని పోలింగ్‌కు అనుమతించారు. పోలింగ్ ముగిసిన చోట ఈవీఎం బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఖమ్మం జిల్లాలో 83.28 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడి 5 నియోజకవర్గాల్లోని 1,456 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పూర్తయ్యాక ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీచైతన్య కళాశాలకు తరలించారు. అక్కడి కౌంటింగ్ కేంద్రంలో ఉన్న స్ట్రాంగ్ రూముల్లో సాయుధ భద్రతా దళాల పహారా మధ్య భద్రపరిచారు. కొత్తగూడెం జిల్లాలోని ఈవీఎంలను పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. కాగా, భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట, చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం, ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నపోపతి, లక్ష్మీపురం, గుండ్రాతిమడుగు గ్రామాల్లో ఉదయం కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించారు. అదే మండలం పల్లిపాడులో ఏపీవో కంట్రోల్ యూనిట్ స్టార్ట్ బటన్‌కు బదులు పొరపాటున క్లోజ్ బటన్ నొక్కడంతో 150కి పైగా ఓట్లు వేసి తరువాత యూనిట్ గంటపాలు ఫ్రీజ్ అయింది. అంతసేపూ అక్కడ పోలింగ్ నిలిచిపోయింది. మరో యూనిట్‌ను తెప్పించి పోలింగ్‌కు కొనసాగించారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

### ఓటేసిన అభ్యర్థులు..

పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వెళ్లిన సమయంలో పోలీసులు తనను అడ్డుకున్నారంటూ, దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు తనతో వాగ్వాదానికి దిగడానికి అవకాశం కల్పించారంటూ పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు పువ్వాడ అజయ్‌కుమార్, కందాళ ఉపేందర్‌రెడ్డి, మదన్‌లాల్, లింగాల కమల్‌రాజ్, సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియానాయక్, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారవు, తెల్లం వెంకట్రావు, మెచ్చా నాగేశ్వరరావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, ఇతర ప్రముఖులైన ప్రజాప్రతినిధులు, అధికారులు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, తాతా మధు, సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు, కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక, సీపీ విష్ణు వారియర్, ఎస్పీ వినీత్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోలింగ్ కేంద్రానికి వచ్చిన సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు వారియర్‌లు పలు ప్రాంతాల్లో ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. పలు బూత్‌లతో జరుగుతున్న ఓటింగ్‌ను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. కాగా, రెండు జిల్లాల్లోనూ ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. వృద్ధులు, మహిళలతో తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులు ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు.

## భద్రాద్రి జిల్లాలో 78.66 శాతం పోలింగ్ నమోదు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ మూడో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ భద్రాద్రి జిల్లాలో గురువారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ప్రక్రియను పర్యవేక్షించారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత తొలిసారిగా 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 75.76 శాతం పోలింగ్ నమోదు కాగా.. 2018లో 81.19 శాతం పోలింగ్ నమోదైంది. తాజాగా78.66 శాతం పోలింగ్ నమోదైంది.నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఉంది.

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | ఓటింగ్ శాతం |
|---|---|---|
| కొత్తగూడెం | 2,43,846 | 79.56 |
| అశ్వారావుపేట | 1,55,961 | 78.36 |
| ఇల్లెందు | 2,19,569 | 79.32 |
| పినపాక | 1,98,402 | 79.55 |
| భద్రాచలం | 1,48,661 | 80.13 |
| మొత్తం | 9.66,439 | 78.66 |

# ప్రశాంత వాతావ‘రణం’లో ముగిసిన పోలింగ్

### పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసిన ఎస్పీ వినీత్ జీ

కొత్తగూడెం క్రైం, నవంబర్ 30: ఎట్టకేలకు ఎప్పుడెప్పుడా అన్ని ఎదురు చూసిన సార్వత్రిక ఎన్నికల హడావిడి ముగిసింది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు గురువారం నాటికి తెరపడింది. జిల్లాలోని సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న నేతృత్వంలో పోలీసులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టిష్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 956 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సాధారణ ప్రాంతాల్లో 422లోకేషన్స్‌లో



పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ఎస్పీ వినీత్ జీ

724 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. క్రిటికల్ ప్రాంతాల్లో 12లోకేషన్స్‌లో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో లెఫ్ట్ వింగ్ ఎఫెక్టెడ్ (ఎల్‌డబ్ల్యూఈ) ప్రాంతాల్లో 172లోకేషన్స్‌లో 226పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల్లోని ప్రతి ప్రాంతంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 1500 పోలీస్ బలగాలు, సీఏఎఫ్ బలగాలకు చెందిన 22 కంపెనీలు, టీఎస్ఎస్పీకి చెందిన 20 సెక్షన్లు, ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి 957మందిని బందోబస్తు విధులకు కేటాయించారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతమైన దుమ్ముగూడెం మండలం ఉంజుపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పోలింగ్ ముగిసింది. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ప్రజల్లో మనోధైర్యాన్ని నింపుతూ తమ ఓటు హక్కుని సద్వినియెగం చేసుకునేలా ప్రోత్సహించడంలో సఫలమయ్యారు. ఎస్పీ డాక్టర్ వినీత్ జి సతీసమేతంగా త్రీ ఇంక్లైన్‌లోని పోలింగ్ కేంద్రంలో ఉదయం తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

## వారం రోజుల్లో పెండ్లి ఇంతలోనే అనంత లోకాలకు..

### రోడ్డుపక్కన నిలిపిన లారీని ఢీకొట్టిన బైకర్

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

### స్నేహితుడికి స్వల్ప గాయాలు

తిరుమలాయపాలెం, నవంబర్ 30: వారం రోజుల్లో వివాహం ముహూర్తం.. ఇంట్లో అంతా సందడి.. సందడి.. చకచకా పెండ్లి ఏర్పాట్లు.. సంబురంలో యువకుడు.. అంతా బాగానే సాగుతుందంటే విధికి కళ్లు కుట్టాయే ఏమో పెళ్లి వస్త్రాలను కొనేందుకు బైక్‌పై వెళ్తున్న ఆ యువకుడిని మృత్యువు కబళించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిండిప్రోలుకు చెందిన పసలాది వెంకన్న, అలివేలు దంపతుల కుమారుడు రవీందర్ (24) మిషన్ భగీరథ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చే ఈ 7న అతనికి పెండ్లి జరగనున్నది. ఈ క్రమంలో పెండ్లి వస్త్రాలు తీసుకునేందుకు గురువారం రవీందర్ తన స్నేహితుడు చామకూరి గణేశ్‌తో కలిసి బైక్‌పై ఖమ్మం వెళ్తున్నాడు. తిరుమలాయపాలెం సమీపంలోకి వెళ్లగానే ఎలాంటి సిగ్నల్ లేకుండా రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్ వెనక నుంచి ఢీకొట్టింది. ఘటనలో రవీందర్‌కు తీవ్రగాయాలు కాగా బైక్ వెనక కూర్చున్న గణేశ్ స్వల్ప గాయాలపాలయ్యాడు. క్షతగాత్రులను స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రవీందర్ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. రవీందర్ మృతదేహానికి బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతాత మధు, పార్టీ నాయకులు, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది నివాళి అర్పించారు. చేతికి వచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ‘అంగ రంగ వైభవంగా పెండ్లి చేద్దామనుకున్నాం.. ఇంతలోనే మమ్మల్ని విడిచిపెట్టి పోయావా..’ అంటూ తల్లిదండ్రులు విలపించడం చూపరులను కన్నీరు పెట్టించింది.

## ఓటెత్తిన యువత...

ఖమ్మం ఎడ్యుకేషన్ నవంబర్ 30 : నిమిషాల తరబడి లైన్‌లో ఉండేందుకు ఇష్టపడని యువత.. సెలవులు వస్తే షికారులతో సందడి చేసే భావి పౌరులు.. ఎన్నికలకు ఊహించని విధంగా తమ ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. జిల్లాకు చెందిన వారు ఇతర ప్రాంతాల్లో ఉండి ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఓటు వేసుందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

**అవగాహన సదస్సులతో..**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో ఓటు ప్రాధాన్యతను తెలియపరుస్తూ అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని అర్థమయ్యేలా వివరించారు. దీంతో విద్యార్థులు సైతం ఓటు కంటే ఏదీ ఎక్కువ కాదనేలా ఈవీఎం మీట నొక్కేశారు.

**ఓటు బాధ్యత : చిట్టూరి సాయి శ్రీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని**

ఓటు విలువ ప్రతి ఒక్కరికి తెలియాలంటే మనం వేసి ఇతరులకు వేయాలనే చెప్పాలి. పని ఒత్తిడిలో ఇతర ప్రాంతంలో ఉన్నప్పటికీ ఓటు హక్కు వినియోగించుకున్నాను. ఓటు వేయడం మన బాధ్యత, ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. తొలిసారి ఓటు వేయడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతి.

## ఈబయ్యారం పోలింగ్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

- బీఆర్ఎస్ అభ్యర్థి రేగాను పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు
- పోలీసులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన రేగా

పినపాక, నవంబర్ 30: మండలంలోని ఏడూళ్లబయ్యారం పోలింగ్ స్టేషన్ వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. పోలింగ్ సరళిని పరిశీలించడానికి బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పోలింగ్ స్టేషన్‌కు వచ్చారు. పోలింగ్ స్టేషన్ లోపలికి వెళ్లడానికి వీలు లేదని బందోబస్తు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు రేగాను నిలిపివేశాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని, నేను పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లే అనుమతులు ఉన్నాయని రేగా పోలీసులకు చెప్పారు. లోపలికి వెళ్లేది లేదని రేగాను అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. ఈ లోపు అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్సై సతీష్ అక్కడికి చేరుకున్నారు. పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లడానికి పర్మిషన్ లేదని రేగాను నిలిపివేశారు. దీంతో అక్కడ మరింత ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. అక్కడికి చేరుకున్న మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు రేగాతో, పోలీసులతో మాట్లాడి పరిస్థితిని శాంతింపజేశారు. రేగా పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం ఈబయ్యారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న రేగా సీఆర్‌పీఎఫ్ బలగాలు, ఎస్సై సతీశ్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను బీఆర్ఎస్ అభ్యర్థినని పోలింగ్ స్టేషన్‌కు వెళ్లే పర్మిషన్ ఉందని చెప్పినా సీఆర్‌పీఎఫ్ బలగాలు, ఎస్సై సతీశ్ తనను అకారణంగా అడ్డుకుని నన్ను అవమానించారన్నారు. పోలీసులకు తోడు స్థానిక కాంగ్రెస్ అల్లరి మూకలు తనను దూషిస్తూ తనపై దాడికి దిగారని ఆరోపించారు. ఈ విషయంపై తాను ఎస్పీ జిల్లా రిటర్నింగ్ అధికారి, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



పోలింగ్ స్టేషన్ వద్ద రేగాను అడ్డుకుంటున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

## ఓటు వేసేందుకు అమెరికా నుంచి..

వైరాటౌన్, నవంబర్ 30: వైరా మున్సిపాలిటీలోని 5వ వార్డులో సముద్రాల మనోజ్ఞ అమెరికా నుంచి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నది. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తన ఓటు హక్కును వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో వినియోగించుకున్నది. ఈ సందర్భంగా సముద్రాల మనోజ్ఞ మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని, ప్రతి ఒక్క పౌరుడు తన బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ఆమె తెలిపారు.